‘డబుల్’ పంచాయితీ

- ఏళ్లు గడుస్తున్నా.. పంపిణీ చేయని వైనం
- అర్హుల ఎంపికలో గందరగోళం
- ఆందోళనలో లబ్ధిదారులు


జైనథ్‌లో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

జైనథ్: 2016లో రూ. 8.23 కోట్లతో ప్రారంభమైన డబుల్‌బెడ్ రూం పనులు నిర్మాణం పూర్తయి దాదాపు ఐదు ఏండ్లు గడుస్తున్నా.. పంపిణీకి నోచుకోవడం లేదు. ఇప్పటి వరకు అర్హుల ఎంపిక కోసం ఆయా తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో మూడుసార్లు గ్రామసభలు ఏర్పాటు చేయడంతో గందరగోళం ఏర్పడింది. మొత్తం 131 ఇళ్లకు ఐదు రేట్లు దరఖాస్తులు రావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అసలే ఇల్లు, భూములు లేని నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ కూడా జాబితాలో అనర్హులు ఉన్నారంటూ పలువురు గ్రామస్తులు ఆందోళన చేపడుతున్నారు. దీంతో డబుల్ బెడ్‌రూంల పంపిణీ కార్యక్రమం ఎప్పుడు కొలిక్కి వస్తుందా? అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

ఇటీవలే మూడో ‘సారి’ గ్రామసభ..

లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభ నిర్వహించడం జరిగింది. అయితే అప్పట్లోనే లబ్ధిదారుల జాబితాలో అనేకమంది అనర్హులు ఉన్నారంటూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఇళ్ల నిర్మాణం పూర్తయినా.. తరువాత మరోమారు గ్రామసభ ద్వారా జాబితా సిద్ధం చేశారు. ఈసారి కూడా ఇతర లబ్ధిదారులు ఆందోళన చేయడంతో పంపిణీ ఆగిపోయింది. అయితే ఇళ్ల నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా పంపిణీ చేపట్టకపోవడంతో స్థానికులు ఇళ్లను ఆక్రమించుకున్నారు. మొత్తం 131 ఇళ్లల్లో ప్రస్తుతం 131 కుటుంబాలు అనాధికారికంగా నివాసం ఉంటున్నాయి.

మళ్లీ మొదటికి..

ఈనెల 9న మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మండల కేంద్రంలోని 131 డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 131 మంది లబ్ధిదారులను ఎంపిక చేసారు. అయితే జాబితాలో అనర్హులు ఉన్నారని, అధికారులు పక్షపాత ధోరణితో నిరుపేదలైన అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు ఎలాంటి పక్షపాత వైఖరి లేకుండా అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న మండల కేంద్రం గుండా వెళ్లే జాతీయ రహదారిపై బైఠాయించారు. వీరికి కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు మద్దతు తెలపడంతో ఆందోళన ఉద్రిక్తంగా మారింది. పోలీసులు రంగప్రవేశం చేసి, పలువురిని అరెస్ట్ చేశారు. దీంతో వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఈవిషయంలో ఎలా ముందుకుపోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అర్హులకు అన్యాయం



భూమి, ఇల్లు లేని నిరుపేదలకు ముందుగా ఇల్లు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ ఇటీవలే సిద్ధం చేసిన జాబితాలో చాలా మంది అనర్హులు ఉన్నారు. ఇళ్ల భూములు ఉన్నవారికి డబుల్ బెడ్‌రూం అర్హుల జాబితాలో చేర్చారు. మాకు ఎలాంటి ఆధారం లేదు. కూలీ పని చేసుకొని జీవిస్తున్నాం. అధికారులు వెంటనే మాలాంటి పేదలకు ఇళ్లు ఇప్పించాలి.

– తాటిపెల్లి లక్ష్మి, జైనథ్

ఏళ్లుగా ఎదురుచూపులు..



గ్రామంలో 131 ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నాయి. అధికారులు రేపు మాపు ఉంటున్నారు. కానీ ఇళ్లు మాత్రం పంపిణీ చేయడం లేదు. మాకు ఇండ్లు, భూములు లేవు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. అధికారులు డబుల్‌బెడ్ రూంలు ఇస్తారని ఏళ్లుగా ఎదురుచూస్తున్నాము. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– గజ్జల్వార్ కవిత, జైనథ్

కలెక్టర్‌కు నివేదించాం

జైనథ్ గ్రామ పంచాయతీలో గ్రామ సభ ఏర్పాటు చేశాం. ఇండ్లు, భూములు లేని నిరుపేదలకు ప్రాధాన్యత ఇస్తూ మొత్తం 131 ఇళ్లకు 131 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. జాబితాను జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– రాఘవేంద్రరావు, తహసీల్దార్, జైనథ్

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు స్పెషల్ బస్సులు

ఆదిలాబాద్: ఇంటర్ పరీక్షల నేపథ్యంలో బుధవారం నుంచి ఏప్రిల్ 4వరకు ఆదిలాబాద్ డిపో పరిధిలో స్పెషల్ బస్సులు నడపనున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల సమయాన్ని దృష్టిలో ఉంచుకొని రాకపోకలకు అనుగుణంగా సర్వీసులు నడుపుతామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంద్రవెల్లిలో అకాల వర్షం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం అకాల వర్షం కురుసింది. అకాల వర్షంతో చేతికి వచ్చిన గోధుమ, జొన్న పంటలు తడిసి మద్దయింది. దీంతో తీవ్ర నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బాబా చూపిన మార్గంలో నడవాలి

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ పూలాజీబాబా చూపిన మార్గంలో నడవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మారుతి డోంగ్రె అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సంత్ సద్గురు పూలాజీబాబా ధ్యాన్ మందిరం వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యారు. పూలాజీబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ దేవ్‌పూజే సంగీత, దత్తా మహరాజ్, డాకురే రాందాస్, ముఖడే విష్ణు, ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, డాకురే మాధవ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాత

తాంసి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై భీంపూర్ మండలంలోని అందర్‌బంద్‌లో కళాజాత బృందం సభ్యులు మంగళవారం అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులు ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కంటివెలుగు, పరిసరాల పరిశుభ్రతపై పాటలు పాడుతూ.. ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, కళా బృందం సభ్యులు రమేశ్, వెంకట్రావు, రవి, నగేశ్, నర్సమ్మ, శిరిష పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా చూడాలి

కైలాస్‌నగర్: ఇంటర్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రంగినేని శాంతారావు డిమాండ్ చేశారు. మంగళవారం డీఐఈవో రవీందర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మార్క్స్ కృషి చిరస్మరణీయం

ఎదులాపురం: పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి సామాజిక ఆర్థిక విముక్తికి కారల్ మార్క్స్ చేసిన కృషి చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మార్క్స్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముడుపు నళినీరెడ్డి, అరుణ్ కుమార్, సురేశ్, దత్తు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం కామ్రేడ్ కారల్ మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘రైతులు ఆందోళన చెందొద్దు’

జైనథ్: శనగ రైతులు ఆందోళన చెందవద్దని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో కొనసాగుతున్న శనగల కొనుగోళ్లను జిల్లా గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, ఏఎంసీ చైర్మన్ గొడం వర్ష సునీల్‌తో కలిసి పరిశీలించారు.

ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కైలాస్‌నగర్: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష 2023ను మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. బుధవారం విద్యాశాఖ మోడల్ స్కూల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. పరీక్ష పత్రం విద్యార్థి చేతికి వచ్చే వరకు నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుమేర్ పాషా, తబ్రెస్ ఖాన్, పవన్, రహీం పాల్గొన్నారు.

పోషకాహార లోపం లేకుండా చూడాలి

తాంసి: చిన్నారులకు పోషకాహార లోపం లేకుండా చూడాలని ఎస్సై లాల్‌సింగ్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ట్రైనర్ శివారెడ్డి ప్రాథమిక విద్య బోధన గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, మహిత ప్రోగ్రాం ఇన్‌చార్జి కిషోర్, కోఆర్డినేటర్ ఇమ్రాన్‌ఖాన్, అంగన్‌వాడీ టీచర్లు సరిత, గంగమ్మ, భాగీర్థ పాల్గొన్నారు.

బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: బీజేపీ శత్రువులను సైతం గౌరవించే పార్టీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్రాల నగేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో బండిసంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేస్తాడన్నారు. ఎమ్మెల్సీ కవితను కించపరిచినట్లు బీఆర్ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్‌కు ఎల్లప్పుడూ కార్యకర్తల మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జోగు రవి, దినేష్ మటోలియా, లోక ప్రవీణ్ రెడ్డి, రాకేశ్, పాయల్ శరత్, కృష్ణ యాదవ్, సోమ రవి, మహేంద్ర, రఘుపతి, సాయి పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో లోపించిన పారదర్శకత

ఆదిలాబాద్: టీఎస్‌పీఎస్‌సీ ద్వారా నిర్వహిస్తున్న పోటీ పరీక్షలలో పారదర్శకత లోపించిందని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకులు లైబ్రరీ ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, పాలకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ, ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. పేపర్లు లీక్ అవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని విమర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇచ్చోడ: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడే మానాజీ, బూత్ స్వశక్తికరన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ గొరంచు గంగారెడ్డిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆరు మండలాల శక్తి కేంద్ర ప్రముఖ్, విస్తారక్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తె, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మాధవ్ అమ్టె, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు ‘కంటివెలుగు’


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చంద్రకళరాజు

నార్నూర్: అంధత్వ నివారణకు కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎంపీపీ అడ చంద్రకళరాజు అన్నారు. మంగళవారం గాదిగూడ మండల కేంద్రంలో కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. దశల వారీగా గ్రామ పంచాయతీ పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం జైవంతరావు, హెల్త్ సూపర్‌వైజర్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్‌లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. మూడు రోజుల నుంచి గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగవారం 124 మందికి కంటి పరీక్షలు చేయగా.. 46 మందికి కళ్లద్దాలు అందజేశారు. 18 మందిని ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేసినట్లు కంటి వెలుగు నిర్వాహకులు హరిత, గౌతంకుమార్ తెలిపారు.

పాదయాత్ర విజయవంతం చేయండి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ నర్సయ్య, నాయకులు

తాంసి: కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ కౌడాల సంతోష్ కోరారు. మంగళవారం మండలంలోని కప్పర్లలో సమావేశం నిర్వహించారు. ఈనెల 16న జిల్లాలోని పిప్రి గ్రామంలో పాదయాత్ర ప్రారంభమౌతుందన్నారు. సమావేశంలో నాయకులు బుజ్జన్న, చిన్న రాంరెడ్డి, గంగారెడ్డి, రాజ్‌బలి పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : నియోజకవర్గం నుంచి ఈనెల 16న చేపట్టనున్న జోడో యాత్రను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పిప్రి గ్రామం నుంచి ఇచ్చోడ వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. అనంతరం ఇచ్చోడలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు జల్కే పాండురంగ్, ఈర్ల శివుడు, బత్తిని కిషన్, కీర్తి రమణ, రాజు, అశోక్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కైలాస్‌నగర్: పట్టణంలోని భుక్తాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత మరాఠీ మీడియం పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఈవో ప్రణీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువులను, తల్లిదండ్రులను గౌరవించి మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం షీ టీమ్ ఏఎస్సై సునీత విద్యార్థులకు, బాలికలకు కల్పిస్తున్న రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్ కుమార్, ఉపాధ్యాయులు రితేష్, గోపాల్, కవిత, వైశాలి, రాజశ్రీ పాల్గొన్నారు.

అలరించిన ఆనందమేళా

తలమడుగు: మండలంలోని ఖోడద్ జెడ్పీ పాఠశాలలో మంగళవారం ఆనంద మేళా నిర్వహించారు. జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీడీవో రమాకాంత్ మేళాను ప్రారంభించారు. విద్యార్థులు చేసిన వంటకాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఆనంద్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థి అన్ని రకాల కూరగాయలను మెడలో వేసుకొని ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ కుమారి, ఉపాధ్యాయులు సుకుమార్, వెంకట్‌రెడ్డి, లక్ష్మి, సర్పంచ్ ఆనంద్, పురుశోత్తం, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

‘దళితబంధు’ లబ్ధిదారుల ఆందోళన

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన దళితబంధు లబ్ధిదారులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామంలో పది మందికి యూనిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కొందరికి రూ. 5 లక్షలే ఇచ్చారని, మిగతా డబ్బుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి పూర్తిస్థాయిలో రుణాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

వైద్య శిబిరం

తాంసి: భీంపూర్ మండలంలోని భగవాన్‌పూర్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు కిషోర బాలికలకు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధుల నిర్ధారణ కోసం రక్త నమునాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, ఆరోగ్య కార్యకర్త నఫీసా, సర్పంచ్ రేష్మా పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

నార్నూర్: నర్సరీల నిర్వహణపై దృష్టి సారించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని బాబేఝరి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. నర్సరీల నిర్వహణతో పాటు మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు పోయాలన్నారు. ఆయన వెంట ఏపీవో సురేందర్ రాథోడ్, టీఏ బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

ఇంద్రవెల్లి: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గంగాధర్‌ను మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సుఫీయన్, దేవ్‌పూజే మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: మండల తహసీల్దార్‌గా ఆర్కా మోతిరాం బాధ్యతలు చేపట్టడంతో మంగళవారం వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, తుడందెబ్బ మండలాధ్యక్షుడు కనక ప్రభాకర్‌లు సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి సర్పంచ్ శ్రీధర్ రెడ్డిని గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పంచాయతీ రాజ్ శిక్షణ శిబిరానికి వెళ్లి వచ్చాడు. గ్రామాభివృద్ధిలో ప్రజల పాత్ర, పంచాయతీ పాత్ర, పాఠశాలల అభివృద్ధిపై ఇచ్చిన శిక్షణ గురించి గ్రామస్తులకు వివరించారు.

గ్రామాభివృద్ధికి కృషి

నేరడిగొండ: గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీటీసీ అంబేకర్ పండరి అన్నారు. మంగళవారం వడూర్ గ్రామంలో ఎంపీటీసీ నిధులు సుమారు రూ.2 లక్షలతో ప్రాథమిక పాఠశాలతో పాటు బోర్ వేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ధర్మపురి రాఘవులు, గాదె ఊశన్న, ఉపాధ్యాయులు రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

తాంసి: మండల సమాఖ్యలో పని చేస్తున్న వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వీవోఏల భీంపూర్ మండల అధ్యక్షుడు అరుణ్ డిమాండ్ చేశారు. ఈనెల 16, 17, 18న సమ్మె చేపట్టనున్నారు. మంగళవారం ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, రాంజీ, సత్యనారాయణ, రమేశ్, భరత్ పాల్గొన్నారు.

సేవకు గుర్తింపు

బోథ్: తాను చేస్తున్న సేవకు గుర్తింపుగా పాండిచ్చేరిలోని ‘గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ’ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించిందని బోథ్ మండల కేంద్రానికి చెందిన అనిల్ తెలిపారు. ఈనెల 25న పాండిచ్చేరిలో డాక్టరేట్ అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

బోథ్: మండలానికి చెందిన 108, 102, 1962 అత్యావసర వాహనాలను జిల్లా కోఆర్డినేటర్ వసంత్ మంగళవారం తనిఖీ చేశారు. వాహనాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ రవీందర్, సంతోష్, స్వామి, ప్రవీణ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) సబ్‌స్టేషన్‌లో బుధవారం మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని భీంపూర్ విద్యుత్ శాఖ ఏఈ శ్రావణ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. భీంపూర్ మండలంలోని అర్లి(టి), కరంజి(టి), వడూర్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు దివ్యాంగుల సమావేశం

ఇచ్చోడ: బోథ్ మండల కేంద్రంలో దివ్యాంగుల సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కరంపై చర్చించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్షయగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తాం


ప్రోటీన్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన


హెల్త్ మేళాపై ప్రచారం చేస్తున్న ఏఎన్ఎంలు

ఇంద్రవెల్లి: క్షయగ్రస్తులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని అదనపు డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా హెల్త్‌మేళా నిర్వహించారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం క్షయగ్రస్తులకు ప్రోటీన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ: క్షయవ్యాధిపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీటీసీ నిమ్మల శివకుమార్‌రెడ్డి అన్నారు. మంగవారం మండల కేంద్రంలోని ఈస్ట్‌సబ్ సెంటర్‌లో అవగాహన కల్పించారు. రోగులకు ప్రభుత్వం నుంచి వచ్చిన మందు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎం విజయలక్ష్మి, వార్డు సభ్యులు అనురాధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెల్త్ మేళాను మంగళశారం నిర్వహించారు. వైద్యురాలు నిఖిత్ మాట్లాడుతూ.. ఏడు రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయను నివారించడానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శశికళ, సర్పంచ్ దారట్ల భాస్కర్, ఆశ కార్యకర్తలు పార్వతి, సునీత, పుష్ప, అంగన్‌వాడీ టీచర్లు రాజమ్మ, అనిత పాల్గొన్నారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే

గుడిహత్నూర్: మన ఆరోగ్యం.. మన చేతుల్లో ఉందని మండల వైద్యాధికారి శ్యాంసుందర్ అన్నారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోషం, శాంతాపూర్, సీతాగోంది, మన్నూర్, ముత్నూర్ గ్రామాల్లో హెల్త్ మేళా కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. క్షయ వ్యాధికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందన్నారు. ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటు పడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. బుధవారం కేఆర్‌కే కాలనీలోని బస్తీ దవాఖానాలో నిర్వహించిన క్షయ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, మాజీ ఎంపీటీసీ సంతోష్, జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీకాంత్, వైద్యులు రాహుల్, శ్రీనివాస్, ఏఎస్ఎం శకుంతల, కౌన్సిలర్ అంజుబాయి పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌లో హెల్త్ సబ్‌సెంటర్‌లో మంగళవారం మెడికల్ ఆఫీసర్ ప్రతాప్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ క్షయ నివారణ కార్యక్రమం నిర్వాహించారు. ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిట్టబోంగారం హెల్త్ సెంటర్ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జైనథ్: ప్రతీనెల 14న తప్పనిసరిగా హెల్త్‌మేళా నిర్వహించాలని జైనథ్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నైనత అన్నారు. మంగళవారం మండలంలోని కూర సబ్‌సెంటర్‌లో హెల్త్‌మేళా నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వేణు, సుశీల, ఏఎస్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు సీఎస్ ఉదయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కళాశాలలో పరీక్ష ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, ఏకలవ్య గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలో గాదిగూడ చెందిన మొత్తం 567 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో బుధవారం నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ మోహన్‌సింగ్ అన్నారు. మంగళవారం పలు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 981 మంది విద్యార్థులు, గిరిజన గురుకుల బాలికల కళాశాల్లో 295, బాలుర కళాశాలలో 776 మంది విద్యార్థులు, పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.